

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 05.07.2026 | సంపుటి: 3 | సంచిక: 153 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 05.07.2026 | V0LUME : 3 | ISSUE : 153 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575





# నాడు మీరు నాటిన మొక్కే.. నేడు ముఖ్యమంత్రి

- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న రేవంత్
- మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని ప్రతిపాదన
- కేసీఆర్ పాలనపై విమర్శలు..
- 2034 వరకు కాంగ్రెస్ అధికారంలోనే ఉంటుందన్న ధీమా

**మిడ్జిల్, జూలై 4:**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ నిర్వహించిన కృతజ్ఞత సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. 2006 జూలైలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు గెలిపించి రాజకీయ జీవితానికి బలమైన పునాది వేశారని గుర్తు చేసుకున్నారు. ఆనాడు ప్రజలు నాటిన మొక్కే

మిగతా 2వ పేజీలో..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు 2

- సీఎంను కలిసిన పలువురు మంత్రులు

## ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు రేవంత్

- రేవంత్ రాజకీయ ప్రస్థానంపై భట్టి విక్రమార్క ప్రశంసలు 2



# ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీ అనుమతి వచ్చాకే నీటి నిల్వ

- ప్రజల ప్రాణ భద్రతకే అత్యంత ప్రాధాన్యం
- రూ.1.10 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత మాదే
- భద్రాచలంతోపాటు దిగువన ఉన్న 40 గ్రామాల భద్రతలో రాజీ లేదు
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నాగార్జున సాగర్, రాజముద్ర న్యూస్:**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తిగా పూర్తయి, జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ ఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక అనుమతులు ఇచ్చిన తర్వాతే వాటిని తిరిగి నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 2వ పేజీలో..

# బీఆర్‌ఎస్ తెచ్చిన అప్పు రూ.4,17,495 కోట్లు మాత్రమే

- దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం.. ఇదే మా స్టాండ్
- ఈ అప్పులతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులు, ఆదాయం పెంచింది
- డిప్యూటీ సీఎం చెప్పిన రూ.8,21,651 కోట్లు కట్టు కథ
- అప్పులపై రకరకాల లెక్కలు చెబుతున్న కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు విమర్శల దాడి



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

భట్టి విక్రమార్క అప్పుల విషయంలో అబద్దాలు, అర్ధ సత్యాలు చెప్పి మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేసిండు.. ఆయనకు అప్పుల విషయంలో వాస్తవాలు తెలియవు అని నేను అనుకోను.. తెలిసి కూడా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారు.. లేని అప్పులను ఉన్నట్లుగా చూపి గోబెల్స్ ప్రచారానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ అప్పుల విషయంలో మంత్రి జూపల్లి సవాళ్లు చేసి తోక ముడిచిన తీరును యావత్ సమాజం చూసింది.. ఆ అవమానం నుంచి ఎలాగైనా బయటపడాలనే భావనతో,

మిగతా 3వ పేజీలో..

# 'తెలంగాణ-విక్టోరియా' మధ్య సాంకేతిక సహకారం

- మంత్రి శ్రీధర్‌బాబుతో విక్టోరియా విప్ లీ టార్లామిస్ భేటీ



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో ఇండస్ట్రియల్ ఎకో సిస్టంను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని

మిగతా 2వ పేజీలో..



# జిమ్ యువతే లక్ష్యంగా స్టెరాయిడ్ల దందా

- హైదరాబాద్‌లో టాస్క్ ఫోర్స్ భారీ దాడులు 3
- ఆరుగురు జిమ్ ట్రైనర్ల అరెస్టు.. నకిలీ వైద్య చీటీలతో అక్రమ విక్రయాలు

## అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

- 'క్యూర్' పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు
- అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం 3





# కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం

- 100 రోజుల్లో 185 కేసులు నమోదు 3
- 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం

# తొలి రోజు మంచులింగం దర్శించుకున్న 12 వేల మంది భక్తులు

**జమ్ము, జులై 4:**

కట్టుదిట్టమైన భద్రత, వాతావరణ అవాంతరాల మధ్య హర హర మహాదేవ్ అంటూ బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్‌యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.





# ప్రజారోగ్య పరిరక్షణకు పక్కా చర్యలు

- ఆహార భద్రతపై సీస్ సంజయ్ జాజు సమీక్ష

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టిసారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని

మిగతా 2వ పేజీలో..

# కవితకు ఎన్నికల సంఘం షాక్

- టిఆర్ఎస్ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం

మిగతా 2వ పేజీలో..




# నిలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ హాస్పిటల్‌లో చోటు

మిగతా 3వ పేజీలో..





# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

- సీఎంను కలిసిన పలువురు మంత్రులు

హైదరాబాద్, జూలై 4 :

ప్రజా జీవితంలో విజయవంతంగా 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరిలు ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ప్రజా సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగిస్తున్న పాలన మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పాలమూరు జిల్లా మిడ్జిల్ జెడ్పీటీసీగా ప్రారంభమైన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం నేడు ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం ఆయన పట్టుదల, ప్రజల పట్ల నిబద్ధత, నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి పదవిని ప్రజా సేవకు వేదికగా మలుచుకుంట ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన ఎదిగారని కొనియాడారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదలు, ఆదివాసి గిరిజనులు, బలహీన, అణగారిన వర్గాల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా జీవితంలో మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రేవంత్ భావోద్వేగ సందేశం

- ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి చేరుకున్నానన్న సీఎం
- తెలంగాణ పునర్నిర్మాణానికి అంకితమవుతానని హామీ

హైదరాబాద్, జూలై 4:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ సామాజిక మాధ్యమం వేదికగా భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. ప్రజా జీవితంలో రెండు దశాబ్దాల ప్రయాణం తన జీవితంలో చిరస్మరణీయ అధ్యాయమని పేర్కొంటూ, ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. "లక్షల అక్షరాలతో రాసినా, కోట్ల పదాలతో చెప్పినా తరగని మధుర జ్ఞాపకం ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం" అంటూ తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. మిడ్జిల్‌లో ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం నేడు ప్రజల హృదయాల్లో "రేవంతన్న"గా నిలిచే స్థాయికి చేరిందని పేర్కొన్నారు. ఈ 20 ఏళ్లలో ప్రతి సందర్భంలో, ప్రతి పోరాటంలో తన వెంట నిలిచిన ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ జీవితంలో ప్రజల ఆదరణ, కార్యకర్తల సహకారం ఎంతో కీలకమైందని చెప్పారు.

భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల హృదయాల్లో "రేవంతన్న"గా తన స్థానాన్ని మరింత బలపరుచుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

మొదటిపేజీ తరువాయి

షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని కవిత స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లు తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ , లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత దీటుగా బదులివ్వడం రాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.








# నాడు మీరు నాటిన మొక్కే.. నేడు ముఖ్యమంత్రి

మొదటిపేజీ తరువాయి

నేడు మహావృక్షమై ముఖ్యమంత్రిగా మీ ముందున్నానని అన్నారు. ఈ విజయం తనది కాదని, మిడ్జిల్ ప్రజలదేనని పేర్కొన్నారు. ఈ గడ్డ రుణం తీర్చుకోవడానికి తన ప్రాణం ఇచ్చినా తక్కువేనని వ్యాఖ్యానించారు.

**మిడ్జిల్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

ఒకప్పుడు చీకటి ప్రాంతాలుగా పేరున్న మిడ్జిల్, గట్టు ప్రాంతాల ప్రజలు మార్పు కోసం తీసుకున్న నిర్ణయమే తన రాజకీయ జీవితాన్ని మలిచిందన్నారు. మిడ్జిల్ మండలాన్ని జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు దానిని దత్తత తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సభ వేదికగా సూచించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి ఎదుగుదలకు తోడ్పడిన ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై గెలిచిన ప్రత్యర్థి రబ్బానీకి కూడా మంచి పదవి ఇచ్చి గౌరవించాలని సూచించారు.

**పాలమూరు బిడ్డకు పరిపాలన రాదా?**

నల్లమల ప్రాంతం నుంచి వచ్చిన తనకు పరిపాలన గురించి తెలియదంటూ కొందరు చేసిన విమర్శలను సీఎం తిప్పికొట్టారు. గ్రామాల సమస్యలు పరిష్కారమైతే రాష్ట్ర సమస్యలు తీరినట్లేనని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా పరిపాలనపై పూర్తి అవగాహన ఉందన్నారు. "పరిపాలన చేయడానికి పాలమూరు బిడ్డ పనికిరాడా?" అంటూ ప్రశ్నించారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యకు తమ ప్రభుత్వం పరిష్కారం చూపిందని, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న వడ్లకు బోనస్ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**కేసీఆర్ పాలనపై విమర్శలు**

పదేళ్ల పాలనలో భారీ అప్పులు మిగిల్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేసీఆర్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి హామీలు నెరవేర్చలేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిన వారే ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహిళల గోప్యతను కూడా భంగం కలిగించే చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు.

**2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే**

అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఇక అధికారాన్ని మరిచిపోవాలని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసే దిశగా తెలంగాణ ప్రజలు ముందుండాలని, ఆ ఉద్యమానికి మిడ్జిల్ నుంచే శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు రేవంత్

మిడ్జిల్, జూలై 4:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీగా ఆశీర్వదించిన ప్రజల వద్దకు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వచ్చి కృతజ్ఞతలు తెలపడం రేవంత్ రెడ్డి రాజకీయ సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా పేద ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువైన పాలన అందిస్తున్న నాయకుడు రేవంత్ రెడ్డేనని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి ప్రకృతి కూడా సహకరిస్తోందని వ్యాఖ్యానించారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ**

రాష్ట్రంలో ఆకలి లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా కోటి 15 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో భయాందోళనల మధ్య జీవించిన తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించిన నాయకుడు రేవంత్ రెడ్డేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇదే ప్రజల ఆశీర్వాదానికి కారణమవుతోందని అన్నారు.



# 'తెలంగాణ విక్టోరియా' మధ్య సాంకేతిక సహకారం

మొదటిపేజీ తరువాయి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. విక్టోరియా(ఆస్ట్రేలియా) శాసనమండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ శనివారం బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా 'తెలంగాణవిక్టోరియా' మధ్య వాణిజ్య, సాంకేతిక సహకారంపై చర్చించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్, స్టార్టప్ ఎకోసిస్టమ్, విద్య, నైపుణ్యాభివృద్ధి, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన'గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఈ క్రమంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. 'తెలంగాణ f¤టి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం.. ఏయే అంశాల్లో కలిసి పనిచేసేందుకు అవకాశాలున్నాయో గుర్తించి ఆ దిశగా సమగ్ర రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం' అని విప్ లీ టార్లామిస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్ జాజు పాల్గొన్నారు.

# ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అనుమతి వచ్చాకే నీటి నిల్వ

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ విజయవిహార్‌లో సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. రాజకీయాల కంటే ప్రజల భద్రత, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకే మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అన్ని లోపాలను సరిదిద్దిన తర్వాత, ఎన్‌డీఎస్ ఏ, సీడబ్ల్యూసీ పూర్తిస్థాయిలో పరిశీలించి అనుమతి ఇచ్చిన తరువాతే బ్యారేజీలను నిర్వహిస్తాం" అని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చయిందని, ఆ ఆస్తిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అన్నారు. మరమ్మతులు పూర్తికాకముందే బ్యారేజీలను నిర్వహించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో భద్రాచలం పట్టణంతో పాటు దిగువన ఉన్న సుమారు 40 గ్రామాల ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో చేపడుతున్నామని మంత్రి వివరించారు. భూగర్భ సాంకేతిక పరీక్షలు, నాన్‌డిస్ట్రక్టివ్ టెస్టులు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు, డ్రోన్ సర్వేలు, వందకు పైగా బోర్ హోల్స్ ద్వారా నిర్మాణాల పరిస్థితిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డీఎస్ ఏ సూచనల మేరకు బ్యారేజీల అన్ని గేట్లను ఎత్తి ఉంచి, నీటి ఒత్తిడి లేకుండా నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల మరియు విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ ఎస్), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), అంతర్జాతీయ నిపుణులు



కలిసి పునరుద్ధరణ నమూనాలను పరిశీలిస్తున్నారని, భద్రతపై పూర్తి నమ్మకం వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

నాగార్జునసాగర్ డ్యామ్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం నాగార్జునసాగర్ డ్యామ్ భద్రత, నిర్వహణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అవసరమైన అన్ని మరమ్మతుల అంచనాలను వెంటనే సిద్ధం చేసి పరిపాలనా అనుమతులకు పంపాలని అధికారులను ఆదేశించారు. లైనింగ్ అవసరమైన కాలువలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల గుండా వెళ్లే ఓపెన్ కాలువలను దశలవారీగా కప్పివేసే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. దీనివల్ల చెత్త వేయడాన్ని అరికట్టడంతో పాటు పరిశుభ్రత మెరుగుపడుతుందని చెప్పారు. ప్రతి సాగునీటి పనిలో నాణ్యత, వేగం అనే రెండు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోనే పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. అంతకుముందు మిర్యాలగూడలో ఎగుమతులకు అనువైన ఆధునిక రైస్ మిల్లును మంత్రి ప్రారంభించారు. అనంతరం గుల్లపోతులగండి, కేశవాపూర్, నెల్లికల్లు ఎత్తిపోతల పథకాల పనులను పరిశీలించి, వాటిని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో ప్రకటించిన అనేక సాగునీటి పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని భూమిపై అమలు చేస్తూ రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సమావేశంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు పక్కా చర్యలు

మొదటిపేజీ తరువాయి

సూచించారు. డాక్టర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో శనివారం సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ సి.వి.ఆనంద్, సీ¾ఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్. శ్రీధర్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డీజీ(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తూ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్య శాఖ కమిషనర్ సంగీత, డ్రగ్ కంట్రోలర్ డీజీఅవినాష్ మొహంతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వర్షా భావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి :కలెక్టర్లతో సిఎస్**

తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యం పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని సీఎస్ స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రాణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రాధాన్యతా అంశాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిరంతర సక్షలు జరపాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# బీఆర్ఎస్ తెచ్చిన అప్పు రూ.4,17,495 కోట్లు మాత్రమే

మొదటిపేజీ తరువాయి

ఆత్మరక్షణలో భాగంగా భట్టి అప్పులపై తప్పుడు లెక్కలు వండి వార్చారన్నారు. మేం అప్పుల విషయంలో క్లిస్టర్ క్లియర్ గా ఉన్నం.. ఈరోజు మళ్లీ ఒకసారి భట్టి, రేవంత్ రెడ్డికి, మంత్రులందరికి, ప్రజలందరికీ ఆధారాలతో అప్పుల విషయంలో స్పష్టత ఇవ్వదలుచుకున్నాను. మేనిఫెస్టోలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదు? అప్పులు అప్పులు అంటూ ఎందుకు కుంటి సాకులు, సొల్లు పురాణం చెబుతున్నరు అని ప్రశ్నించారు. కరోనా వచ్చి ఎకానమీ డౌన్ అయినా కేసీఆర్ హయాంలో ఏనాడూ రాష్ట్రం దివాలా తీసింది అనలేదు.. మరి ఇప్పుడు కరోనా లేదు.. పెద్ద నోట్ల రద్దు లేదు.. మీ ముఖ్యమంత్రి ఎందుకు దివాలా అని మాట్లాడుతున్నరు? అంటే పాలనలో మీ ముఖ్యమంత్రి, మీ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఒప్పుకుంటున్నారా? మీ అపారమైన అనుభవం కమీషన్లు దండుకోవడానికి తప్ప రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడలేదు అని ధ్వజమెత్తారు. నిన్న భట్టి హడావుడిగా ప్రెస్ మీట్ పెట్టి అప్పుల విషయంలో అర్థరహితంగా మాట్లాడిండు.. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు.. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.8,21,651 కోట్లు అని మళ్లీ అదే కట్టుకథ చెప్పిండు అని అన్నారు. తెలంగాణ ఏర్పాటైన 2014 జూన్ 2 నాటికి రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ఎఫ్ఆర్బీఎం రుణాలు, ఎస్పీవీ గ్యారంటీ రుణాలు మొత్తం కలిపి రూ.84,268 కోట్లు బిఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో చూపారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు అంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న ఎఫ్ఆర్బీఎం రుణాలు రూ.15,118 కోట్లు. దీన్ని కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పుల్లో కలిపారు. (ఆర్బీఐ రిపోర్టు ఆధారం) అంటే రూ.84,268 కోట్లు + రూ.15,118 కోట్లు = రూ.99,386 కోట్లు ఈ మొత్తాన్ని 2023 డిసెంబర్ 7 నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రుణాలు రూ.5,16,881 కోట్ల నుంచి తీసివేస్తే, రూ.4,17,495 కోట్లు. ఇదే నేను చెప్పిన లెక్క. మీ డాక్యుమెంట్ ప్రకారమే చెబుతున్నా? ఎన్ని కలిపినా వాళ్లు చెప్పిన 8,21,651 కోట్లు నిండటం లేదని అందులో ఏం ఏం కలిపారో మీరే చూడండి. ప్రభుత్వం గ్యారెంటీ ఉండి, కార్పోరేషన్లు చెల్లించేవి, ప్రభుత్వం గ్యారెంటీ లేకుండా కార్పోరేషన్లే చెల్లించేవి కలిపారు. నిజానికి ఈ రుణాలు వాటికవే చెల్లిస్తాయి. ఆర్బీఐ డాక్యుమెంట్ పబ్లిక్ డొమైన్ లోనే ఉంటది ఎవరైనా తెలంగాణ అప్పులు ఎంత తెచ్చిందో చూడొచ్చు. ఇది మాత్రమే కాదు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పు గురించి కాగ్ రిపోర్టు కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. 2024 మార్చి నాటికి ప్రభుత్వమే చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ 1,20,944 కోట్లు. ఇందులో భట్టి చెప్పిన డాక్యుమెంట్ లో



2014, జూన్ 2నాటికి ఉన్న ప్రభుత్వం చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ రూ.11,609 కోట్లు తీస్తే 1,09,335 కోట్లు ఉంటుంది. తెలంగాణ బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2025-26, 14వ పేజీలో చెప్పిన దాని ప్రకారం బిఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం పరిధిలో తీసుకున్న రుణాలు 3,01,484 కోట్లు. అంటే 3,01,484 కోట్లు + 1,09,335 కోట్లు = 4,10,819 కోట్లు. ఇది మేము చెబుతున్న లెక్క కాదు 'కాగ్' చెబుతున్న లెక్క. మిషన్ భగీరథ, కాళేశ్వరం, సీతారామ, స్కీలకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు అక్షరాల 4,10,819 కోట్లు అని 'కాగ్' స్పష్టం చేసింది. ఆ రిపోర్టు మీరు డిసెంబర్ 2023 వైట్ పేపర్ లో చెప్పిన ప్రకారం బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పు 4.17లక్షల కోట్లు. ఇష్టం ఉన్నట్లు లెక్కలు కట్టి అప్పుల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లకు మళ్లీ చెబుతున్నా.. మీ శ్వేతపత్రం ప్రకారం చూసినా, బడ్జెట్ డాక్యుమెంట్స్ ప్రకారం చూసినా, కాగ్ రిపోర్టు ప్రకారం చూసినా, మీ ఎకనామిక్ సర్వే ప్రకారం చూసినా బిఆర్ఎస్ హయాంలో చేసిన 4.17లక్షల కోట్లు దాటలేదు. ఇది మా స్టాండ్ దీని మీద ఎక్కడ, ఎప్పుడు చర్చకైనా సిద్ధమని చెబుతున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పులపై పూటకో మాట. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్క మీద నిలబడతారా అంటే అదీ లేదు. పూటకో మాట, నచ్చినట్లు లెక్కలు మార్చుతూ, అబద్ధాలు ప్రచారం చేస్తున్నరు. అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 6,71,757 కోట్లు అని చెప్పారు. ఇందులో కూడా మాకు సంబంధం లేనివి కలిపారు. మొన్న జూపల్లి ఏమన్నరు, ముందు రోజు 8లక్షల కోట్ల అప్పు అన్నడు, తెల్లారి 7లక్షల కోట్ల అప్పు అన్నడు. శ్వేతపత్రంలో ఒక లెక్క, అసెంబ్లీలో ఒక లెక్క, పత్రికా సమావేశాల్లో ఒక లెక్క ఉంటదా? మీరు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మర్లించడం కోసం, మీరు చేస్తున్న స్కాంల నుంచి డైవర్షన్ చేయడం కోసం అప్పుల పేరుతో డ్రామాలు ఆడుతున్నరు. స్కాంలు బయట పడుతుంటే, ప్రజలు తిరగబడుతుంటే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరు.

8.21 లక్షల కోట్ల అప్పు అనేది కట్టు కథ. వాళ్లు తెచ్చిన అప్పుల విషయంలోనూ తలో మాట. నిన్న భట్టి గారు లక్ష 77 వేల కోట్ల అప్పు తెచ్చినం అంటే.. 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్ బీఎంపాటు, అన్ని రకాల అప్పు ఫిబ్రవరి 28,2026 నాటికి చేసిన అప్పు కలిపి రూ.3,47,294 కోట్లు అని స్వయంగా ప్రకటించారు. నాలుగు నెల్లలో అప్పు ఎట్ల తగ్గింది రేవంత్ రెడ్డి, భట్టి గారు? ఇదంతా గారడీ కాదా? ప్రజలను మోసం చేయడం కాదా? ముఖ్యమంత్రి కరెక్టా? భట్టి కరెక్టా? జూన్ 30 నాటికి పబ్లిక్ డొమైన్ ఉన్న లెక్కల ప్రకారం 31 నెలల్లో రేవంత్ రెడ్డి చేసిన మొత్తం అప్పు నాలుగున్నర లక్షల 50వేల కోట్లు. లంచాలు ఇచ్చి తెస్తున్న అప్పులు. ఎంత దారుణం అంటే.. ఒక దిక్కు బిఆర్ఎస్ అప్పులు చేసింది అని దుష్ప్రచారం చేస్తూ వీళ్లు వేల కోట్ల అప్పులు దొంగదారిన లంచాలు ఇస్తూ తెస్తున్నరు. వీళ్ల బండారం మొత్తం అసెంబ్లీలో నేను అడిగిన ప్రశ్నతోనే బట్టబయలైంది. వేల కోట్ల రూపాయల అప్పులు ఎఫ్ఆర్ బిఎం పరిధిలోకి రాకుండా, వందల కోట్ల లంచాలు (బ్రోకర్ కమీషన్లు) ఇచ్చి తెస్తున్నరు. ప్రభుత్వమే అప్పుల కోసం బ్రోకర్లకు లంచాలు ఇచ్చే పరిస్థితికి దిగజారింది.. అందుకే రేవంత్ రెడ్డిని దొంగలాగా చూస్తున్నరు. దేశ చరిత్రలో ఇంత దిక్కుమాలిన పని చేసిన ప్రభుత్వం మరొకటి ఉండదు. టీజీఐఐసీ భూములను కుదువపెట్టి 10వేల కోట్ల అప్పు తేవడానికి ఇచ్చిన బ్రోకరేజ్ చార్జీ ఎంత అంటే వీళ్లు ఇచ్చిన సమాధానం.... 170 కోట్లు అదే అసెంబ్లీలో మరో ప్రశ్నకు అడిగినం... హెచ్ ఎండీఏ భూములు కుదువ పెట్టడం ద్వారా ఎంత అప్పు సేకరించాలనుకుం టున్నారు అని అడిగితే వచ్చిన సమాధానం.. మరో 20వేల కోట్లు అప్పు తెస్తాం అన్నరు. అంటే 10,000 కోట్ల అప్పుకు 170 కోట్లు బ్రోకర్ చార్జీ చెల్లిస్తే, మొత్తం 30 వేల కోట్లకు గాను బ్రోకర్లకు చెల్లిస్తున్న డబ్బు అక్షరాల రూ. 510 కోట్లు. దీన్ని బ్రోకరేజ్ అంటరా? లంచం అంటరా? ఏమంటరో ప్రభుత్వమే సమాధానం చెప్పాలె. ఇది మాత్రమే కాదు ఇట్లనే వందల కోట్ల లంచాలు ఇచ్చి... మూడు హైదరాబాద్ కార్పొరేషన్లు, డిస్కంలు, హెచ్ ఎండబ్ల్యుఎస్ ద్వారా మరో 70,000 కోట్ల అప్పు తేవాలని టార్గెట్ పెట్టుకున్నరు. అంటే ఈ 70వేల కోట్ల అప్పు కోసం రేవంత్ రెడ్డి బ్రోకర్లకు ఇచ్చే లంచం 1200 కోట్లు. అంటే ఈ 1200 పైనవి ఈ 510 కలిపితే మొత్తం 1710 కోట్లు లక్ష కోట్ల అప్పు కోసం 1710 కోట్లు బ్రోకర్లకు లంచాలు చెల్లిస్తున్నది ఈ ప్రభుత్వం. బాండ్ల ముసుగులో ఇదంతా చేస్తున్నరు. బొందల గడ్డకు కూడా జాగ లేకుండా ఖతం పట్టిస్తున్నరు. ఫైనాన్స్ గ్రాంట్ ఇవ్వడం లేదు మీరు తెచ్చుకోండి అంటే మేం అప్పు తెచ్చుకున్నం, కరోనా వల్ల అప్పు లిమిట్ పెంచితే కొంత తెచ్చుకున్నం, ఉదయ్ స్కీం ద్వారా కేంద్రం బలవంతంగా రుద్దిన అప్పు, జీఎస్టీ పరిహారంగా తెచ్చిన అప్పు ఇవన్నీ మేము చెబుతున్న 4.17లక్షల కోట్ల అప్పులో ఉన్నాయి. మేమీ 4.17లక్షల కోట్లతో... కాళేశ్వరం, మిషన్ భగీరథ, పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సీతారామ ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్క సాగర్, రైతు బంధుకు 72,972కోట్లు రైతు బీమా 6,800 కోట్లు, రైతు రుణమాఫీ 29వేల కోట్లు, ఉచిత కరెంట్ కు 61వేల కోట్లు, గొర్రెల పంపిణీకి 5వేల కోట్లు, మీరు కూర్చుంటున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, పటిష్టమైన భద్రత కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, జిల్లాకు ఒక నర్సింగ్ కాలేజీ, జిల్లాకు ఒక కలెక్టరేట్ కట్టినం. సొంత ఆదాయ వనరులను పెంచినం జీఎస్డీపీ 4,51,580 కోట్ల నుంచి 13,13,391 కోట్లకు పెంచినం, తెలంగాణ తలసరి ఆదాయం 1,24,104 నుంచి 3,17,117 కోట్లకు పెంచినం. ఇవన్నీ ఎందుకు మాట్లాడరు. ఇవన్నీ కళ్ల ముందే ఉన్నాయి కదా? ఇప్పుడు మీరేం చేస్తున్నరు. కరోనా లేదు, నోట్ల రద్దు లేదు, కేంద్రం మెడ మీద కత్తి పెట్టలేదు. భట్టి నిన్న సింగరేణి గురించి మాట్లాడారు.. 40లక్షల బొగ్గు మాయంపై సింగరేణి విజిలెన్స్ విచారణ చేస్తదట. దొంగకే తనకు తానుగా విచారణ చేసుకోమని చెప్పినట్లుంది. సింగరేణిలో కుంభకోణాలు జరిగితే, అదే సింగరేణి విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తాం అనడంలో అర్థం ఉందా? వెయ్యి కోట్ల సోలార్ పవర్ స్కాం గురించి మాట్లాడలేదు. పాకిస్తాన్ బార్డర్ జైసల్మేర్ లో సోలార్ ప్లాంట్ పెడతాం అన్నరు. ఆ స్కాం గురించి మాట్లాడరు. సింగరేణిలో ఎక్స్ ప్లోసివ్ స్కాం గురించి మాట్లాడరు. డీజిల్ స్కాం గురించి మాట్లాడరు. చేతనైతే పాలన మీద దృష్టి పెట్టండి. బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా, శాసన సభ్యుడిగా, కేసీఆర్ శిష్యుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా చెబుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 4.17లక్షల కోట్లు మాత్రమే దీనికి నేను కట్టుబడి ఉన్నా ఏ చర్చకైనా సిద్ధం. పెట్టండి అసెంబ్లీ మాట్లాడుదాం అని హరీష్‌రావు సవాల్ విసిరారు.

# బియ్యం ఎగుమతుల్లో రాష్ట్రం అగ్రస్థానం

**హైదరాబాద్, జూలై 4:**

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ బియ్యం ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి (Minister Uttam Kumar Reddy ) అన్నారు. శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక బందారు అగ్రోటెక్ రైస్ మిల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని తెలిపారు. ఇకపై కేవలం ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, నాణ్యమైన బియ్యాన్ని దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. బియ్యం ఎగుమతులు చేసే రైస్ మిల్లులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీంతో మిల్లర్లు నాణ్యత పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, బ్రాండింగ్, ఎగుమతులపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సంప్రదాయ రైస్ మిల్లుల కాలం ముగుస్తోందని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన సమయం వచ్చిందని మంత్రి అన్నారు. ఆటోమేటిక్ యంత్రాలు, శాస్త్రీయ ధాన్యం ఆరబెట్టే వ్యవస్థలు, సైలోలు, నాణ్యత పరీక్షా పరికరాలు వంటి ఆధునిక సదుపాయాలతో మిల్లులను అభివృద్ధి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. "రైస్ మిల్లుల ఆధునికీకరణ ఇక ఎంపిక కాదు... కాలానుగుణ అవసరం" అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే బియ్యాన్ని కేవలం కేంద్ర ప్రభుత్వానికి సరఫరా చేయడమే కాకుండా, 'తెలంగాణ రైస్' పేరుతో దేశవ్యాప్తంగా, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అన్నారు. నాణ్యతతో కూడిన విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు, మిల్లర్లు, వినియోగదారులందరికీ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటికే 81 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై రైతులు ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రాసెసింగ్ సాంకేతికత, మెరుగైన నిల్వ సదుపాయాలు, పంట అనంతర నష్టాల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. శాస్త్రీయ నిల్వ, సమర్థవంతమైన మిల్లింగ్, నాణ్యమైన బ్రాండింగ్ ద్వారా తెలంగాణ బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఆదరణ లభిస్తుందని చెప్పారు. మిర్యాల గూడలో అత్యాధునిక రైస్ మిల్లును ఏర్పాటు చేసిన బందారు అగ్రోటెక్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఇటువంటి పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు రైతులు పండించే ధాన్యానికి మరింత విలువ తీసుకువస్తాయని అన్నారు.

# కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం

- **100 రోజుల్లో 185 కేసులు నమోదు**
- **121 టన్నుల కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం**

**హైదరాబాద్, జూలై 4:**



హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్‌ఫాస్ట్ విభాగం గత 100 రోజుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి 185 కేసులు నమోదు చేసింది. ఈ దాడుల్లో మొత్తం 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

**భారీగా కల్తీ పదార్థాల పట్టివేత**

జీహెచ్ఎంసీ ఆహార భద్రత అధికారులతో కలిసి హెచ్‌ఫాస్ట్ బృందాలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఆహార తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా 27 వేల కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్, 25 వేల కిలోల కృత్రిమంగా పండించిన పండ్లు, 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 9 వేల కిలోల నిల్వ పచ్చళ్లను స్వాధీనం చేసుకున్నారు. టీ పొడి, కోవా, క్రీమ్, నెయ్యి, పన్నీర్, పెరుగు తదితర ఆహార పదార్థాల్లోనూ కల్తీ జరుగుతున్నట్లు గుర్తించారు.

**పన్నీర్ తయారీలో ప్రమాదకర రసాయనాలు**

పన్నీర్ తయారీలో హానికర రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడిందని అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులు కూడా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రాంతాల వారీగా రాజేంద్రనగర్ జోన్‌లోనే అత్యధికంగా 55 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అక్కడ ఆహార తయారీ కేంద్రాలు అధికంగా ఉండటంతో కల్తీ కార్యకలాపాలు ఎక్కువగా వెలుగులోకి వచ్చినట్లు వివరించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ చట్టం**

ఇప్పటివరకు నమోదైన కేసులతో పాటు మరో 247 కేసులను జీహెచ్ఎంసీ ఆహార భద్రత విభాగానికి బదిలీ చేశారు. హోటళ్లు, బేకరీలు తప్పనిసరిగా ఆహార భద్రత ప్రమాణాల అనుమతి పత్రం కలిగి ఉండాలని, పరిశుభ్రత నిబంధనలు పాటించాలని ఆదేశించారు. కల్తీ ఆహార వ్యాపారులపై అవసరమైతే పీడీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. హెచ్‌ఫాస్ట్ విభాగాన్ని మరింత బలోపేతం చేసి స్టార్ హోటళ్ల నుంచి చిన్న రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాలు, నిల్వ గోదాముల వరకు తనిఖీలు విస్తరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యమని, కల్తీకి పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు.

# జిమ్ యువతే లక్ష్యంగా స్టెరాయిడ్ల దందా

**హైదరాబాద్, జూలై 4:**

హైదరాబాద్ నగరంలో అక్రమంగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లను విక్రయిస్తున్న ముఠాపై టాస్క్ ఫోర్స్ పోలీసులు భారీ దాడులు నిర్వహించారు. జిమ్‌కు వచ్చే యువతను లక్ష్యంగా చేసుకుని తక్షణ కండరాల పెరుగుదల పేరుతో నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ విషయాలను టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. నగరంలో అక్రమ స్టెరాయిడ్లు, అనధికార సప్లిమెంట్ల విక్రయాలపై పలు ఫిర్యాదులు అందడంతో టాస్క్ ఫోర్స్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఉత్పత్తులను తరలిస్తూ విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అరెస్టయిన వారంతా జిమ్ ట్రైనర్లేనని, జిమ్‌కు వచ్చే యువతకు తప్పుడు సమాచారం ఇచ్చి శరీర నిర్మాణం వేగంగా మెరుగవుతుందని నమ్మబలికి ప్రమాదకర ఇంజెక్షన్లు, సప్లిమెంట్లను విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

**ఉత్తరప్రదేశ్, పంజాబ్ నుంచి అక్రమ రవాణా**

ఈ ముఠాలో బట్టే శివా ప్రధాన నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. గతంలో జిమ్ నిర్వహించిన అతడు, ఆ తర్వాత వివిధ జిమ్‌లలో ట్రైనర్‌గా పనిచేస్తూ ఈ అక్రమ వ్యాపారం కొనసాగించినట్లు గుర్తించారు. ఈ ముఠాకు స్టెరాయిడ్లు, సప్లిమెంట్లు సరఫరా చేస్తున్న ప్రధాన డీలర్లను కూడా గుర్తించినట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్ నుంచి స్టెరాయిడ్లను హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు తేలిందన్నారు.

**కృత్రిమ మేధతో నకిలీ వైద్య చీటీలు**

కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి నకిలీ వైద్య చీటీలను రూపొందించి వాటి ఆధారంగా స్టెరాయిడ్ల విక్రయాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న మరో ఇద్దరు సరఫరాదారులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

**వైద్యుల సలహా లేకుండా వాడొద్దు**

అర్హత కలిగిన వైద్యుల సలహా లేకుండా స్టెరాయిడ్లు, సప్లిమెంట్లు వాడడం అత్యంత ప్రమాదకరమని టాస్క్ ఫోర్స్ హెచ్చరించింది. వీటి వల్ల మానసిక సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, కాలేయం, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి ముఠాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, జూలై 4 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 'క్యూర్' పరిధిలో అఫర్డ్‌బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఇదే స్ఫూర్తిని 'క్యూర' పరిధిలో చేపట్టబోయే అఫర్డ్‌బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్‌పై కూడా చూపించాలన్నారు. 'క్యూర్' పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ, హౌసింగ్ విభాగాల అధికారులు సమష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరగా పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకుని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలని ఆదేశించారు. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాల్సి ఉందన్నారు. 'క్యూర' పరిధిలోని 26 నియోజకవర్గాలకు ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నామని, వీటికి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహసీల్దార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి రెండు డీఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని,ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# నిలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

మొదటిపేజీ తరువాయి

చేసుకుంది. ఒడిశాకు చెందిన దంపతులు తమ ఆరు రోజుల మగ శిశువును హాస్పిటల్‌లో చేర్చారు. శిశువు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 25న శిశువును నీలోఫర్‌లో చేర్చిన తల్లిదండ్రులు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పసికందును నీలోఫర్ హాస్పిటల్ వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎన్‌బీసీయూలో చికిత్స అందించి.. శిశువును కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంఒ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పసికందును సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శిశువు తల్లిదండ్రులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



# మేడిగడ్డ బ్యారేజీకి పెరుగుతున్న వరద ప్రవాహం

**భూపాలపల్లి, జూలై 4**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో బ్యారేజీకి వరద నీరు నిరంతరాయంగా చేరుతోంది. వరద ఉధృతి దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యగా బ్యారేజీలోని మొత్తం 85 గేట్లను పూర్తిగా ఎత్తివేసి, వచ్చిన నీటిని వచ్చినట్టుగానే దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమానంగా కొనసాగుతున్నాయి. ఎగువ నుంచి 62,700 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అదే స్థాయిలో 62,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నీటి పారుదల శాఖ సిబ్బంది బ్యారేజీ వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.



# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్ళు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే. ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ




**జయపుర, జులై 4:** పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ–పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ. 1.06 లక్షల కోట్ల విలువైన పెట్రో కెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ. 950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

- భైరవ సేన అనే సంస్థ ఆరోపణలు
- అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ



**డెహ్రాడూన్, జులై 4:** అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా బద్రీనాథ్ ధామ్‌లోనూ ఇలాంటి పుకార్లు జోరందుకున్నాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ మేరకు బీకేటీసీ ప్రెసిడెంట్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలనూ కోరాం' అని తెలిపారు. కాగా.. బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భైరవ సేన అనే ఓ సంస్థ ఆరోపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడికి సంబంధమున్న నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అయితే.. దీనిపై ప్రెసిడెంట్ ద్వివేది స్పందిస్తూ.. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొన్న వ్యక్తి బీకేటీసీలో ఓ ఉద్యోగి మాత్రమేనన్నారు. ఆయన గతంలో ముగ్గురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై బీకేటీసీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోం ఆరోపణలు రావడంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాం. కానీ ఆ ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో పూర్తివివరాలు తెలియరాలేదు. అయినప్పటికీ ఈ విషయం అత్యంత సున్నితమైనదిగా భావించి, ఛైర్మన్‌కు నివేదించాం' అని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలతో సదరు ఉద్యోగుల వివరాలు సేకరించడం సహా వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. విచారణలో ఎవరైనా తప్పుచేసినట్లు రుజువైతే.. వారిపై బీకేటీసీ చట్టం–1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కావడంతో నిరాధార ఆరోపణలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.




# ఘనంగా జ్యోతి విద్యాలయంలో కెప్టెన్ల ఎన్నిక

## క్రమశిక్షణకు మారుపేరు జ్యోతి విద్యాలయం: సీఐ జగన్నాథ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్** :భెల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయ హై స్కూల్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తుందని ఆర్.సి.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డా. జగన్నాథ్ కొనియాడారు. పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత క్రమపద్ధతిలో కార్యక్రమం జరగడం సంతోషకరమన్నారు. క్రమశిక్షణ, విద్యా నైపుణ్యం, అందరినీ కలుపుకొని పోయే నాయకత్వ లక్షణాలు ఉన్న విద్యార్థులను కెప్టెన్లుగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి అర్హతలు ఉన్న విద్యార్థులే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేస్తారని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరి, ఫాదర్ అంబ్రోస్ బెక్ ల మార్గదర్శకత్వంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థి నాయకులు పాఠశాల కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ ప్రియదర్శిని కెప్టెన్లకు స్లాష్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.




# విద్యార్థులకు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సమాజంలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వినూత్న కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్న వికారాబాద్ సురక్ష మిత్ర కార్యక్రమం కింద శనివారం నుండి 10.07.2026 వరకు మొదలైన సైబర్ అవేర్నెస్ వీక్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, వి.పి.ఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్స్) తమ తమ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించే పద్ధతులు, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు, పాఠశాల వివరాలు ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించకూడదని, ఫేక్ ప్రొఫైల్‌లు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు, ఫిషింగ్ లింకులు, బహుమతుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు ఏదైనా అనుమానాస్పద సందేశం, అవమానకరమైన పోస్టు లేదా సైబర్ వేధింపులను ఎదుర్కొంటే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ధృవీకరించకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయరాదని అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ – 1930, చైల్డ్ హెల్ప్లైన్ – 1098, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం – 112, www.cybercrime.gov.in ద్వారా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థులకు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మై సైబర్ సేఫ్టీ ప్లేడ్జి చేయించి, తమ వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరించడం, అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను వెంటనే పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమని, ప్రతి విద్యార్థి సురక్షితమైన డిజిటల్ పౌరుడిగా ఎదగాలనే లక్ష్యంతో వికారాబాద్ సురక్ష మిత్ర కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై పర్యవేక్షణ వహించి సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించాలని కోరారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సురక్ష మిత్ర సైబర్ అవేర్నెస్ వీక్ లో భాగంగా జిల్లా పాఠశాలలు, కేజీబీవీ కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత, రోడ్డు నిబంధనలపై పోలీస్ అధికారులు విస్తృత అవగాహన కల్పించారు.



# యుగపురుషుడు స్వామి వివేకానంద: యువతకు స్ఫూర్తి

- పాగర్తి సుధాకర్
- నేలకొండపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద వర్ధంతి వేడుకలు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు స్వామి వివేకానంద అని భాజపా నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాగర్తి సుధాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద "రామకృష్ణ మిషన్"ను స్థాపించి, దీని ద్వారా విద్య, వైద్యం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి ఎన్నో సామాజిక సేవలను అందించడం ప్రారంభించారని తెలిపారు. దీని ప్రధాన కార్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని బేలూరు మఠంలో ఉందని చెప్పారు.యువతను మేల్కొల్పడానికి స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఇప్పటికీ ఎందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "గమ్యం చేరేవరకు విశ్రమించకు. నువ్వు ఏది అనుకుంటే అది అవుతావు. నిన్ను నువ్వు బలహీనుడివి అనుకుంటే బలహీనుడివి అవుతావు, బలవంతుడివి అనుకుంటే బలవంతుడివి అవుతావు" అని యువతకు ఆయన ఇచ్చిన పిలుపు నేటికీ ప్రాసంగికమని అన్నారు."మానవ సేవయే మాధవ సేవ" అని ఆయన గట్టిగా నమ్మారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షేక్ షర్ఫుద్దీన్, సూరెపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినూద్దీన్, తేజవత్ నాగరాజు, బానోత్ శ్రీనివాస రావు, తేజవత్ హనుమంత్, మూడు రమేష్, తేజవత్ గోపి, తేజవత్ వెంకటేష్ తదితరులు పాల్గొని స్వామి వివేకానందకు నివాళులు అర్పించారు.



# షేర్స్ బజార్ పేరిట భారీ మోసం

**అధిక వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయలు కాజేసిన భూపాల్ నాయక్**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** 'కిసాన్ పరివార్' పేరుతో అధిక వడ్డీలు ఇస్తామంటూ అమాయక ప్రజలను నమ్మించి వేల కోట్ల రూపాయలు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కిసాన్ పరివార్, కిసాన్ పరివార్ లిమిటెడ్, కిసాన్ పరివార్ ఇండస్ట్రీస్, షేర్స్ బజార్ పేరిట కంపెనీలు స్థాపించిన భూపాల్ నాయక్ పెట్టుబడిదారులను భారీగా ఆకర్షించి చివరకు బోర్డు తిప్పేశాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్ ఈ భారీ కుంభకోణానికి సంబంధించి గుజరాత్ పోలీసులు ఇప్పటికే భూపాల్ నాయక్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. పది రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం అతడిని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడిని గుజరాత్ నుండి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు సమాచారం. 'సైబరాబాద్ సీపీ ఆఫీస్ మెట్లెక్కిన బాధితులు' తమకు జరిగిన అన్యాయంపై బాధితులు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022 నుంచి తాము ఈ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నామని, ప్రారంభంలో ఏడాది పాటు సక్రమంగానే వడ్డీలు చెల్లించి, ఆ తర్వాత నమ్మించి ముంచేశారని మీడియా ముందు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోరంపై స్పందించిన పోలీసులు, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బాధితులకు హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా 6,000 మంది బాధితులు ఈ కుంభకోణంలో దేశవ్యాప్తంగా సుమారు 6,000 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 1,200 మంది వరకు మోసపోయారు. మధ్యతరగతి ప్రజలనే లక్ష్యంగా చేసుకుని ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. "బాధిత మహిళ ఆవేదన" నా కూతురి పెళ్లి కోసం దాచుకున్న డబ్బులన్నీ ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఇందులో పెట్టుబడి పెట్టాను. తీరా వీళ్లు బోర్డు తిప్పేయడంతో వేరే దారి లేక అప్పులు చేసి కూతురి పెళ్లి చేయాల్సి వచ్చింది. మాలాంటి మధ్యతరగతి వాళ్లంతా రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలి" అని ఓ బాధిత మహిళ కన్నీటి పర్యంతమైంది. కంపెనీల పేరిట వేల కోట్లు వసూలు చేసిన ఈ భారీ స్కామ్‌పై సైబరాబాద్ "ఈ ఓ డబల్యు " పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.




# ఎస్సీ కాలనీ ప్రజల సౌకర్యార్థం నేలకొండపల్లిలో 5వ నెంబర్ కొత్త రేషన్ షాపు ప్రారంభం

**మంత్రి పొంగులేటికి కాలనీవాసుల పాలాభిషేకం**




**ఖమ్మం రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి, ఎస్సీ, బీసీ కాలనీల ప్రజలు రేషన్ కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి, నేలకొండపల్లిలోని 5వ నెంబర్ డీలర్ రేషన్ షాపును ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కొత్త రేషన్ షాపును స్థానిక నాయకులు దయాకర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి కృతజ్ఞతగా పాలాభిషేకం చేశారు. ప్రజలకు అందుబాటులో రేషన్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు దయాకర్ రెడ్డి తెలిపారు. దీనివల్ల ఎస్సీ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు రేషన్ తీసుకోవడంలో ఎంతో సౌకర్యం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్లు కోడి రెక్కల వినోద్, మన్నె నరేష్, సుప్రజ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నల్లని మల్లికార్జున, బొడ్డు బొందయ్య, రాయపూర్ నవీన్, ఎస్.కె. శుభాన్ తదితరులు పాల్గొన్నారు. కొత్త రేషన్ షాపు ప్రారంభంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతించారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** దొడ్డి కొమురయ్య వర్ధంతి కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయములో అధికార ప్రతినిధి జిల్లా కలెక్టర్ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా తొలి అమరుడు దొడ్డి కొమురయ్య భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని తన అమరత్వముతో మలుపుతిప్పిన ధీరుడు కొమురయ్య అని అన్నారు. అనంతరం కామారెడ్డి జిల్లా కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు మార్కంటి భూమన్న మాట్లాడుతూ వారి ఆశయాలను కొనసాగించాలని అన్నారు అనంతరం రామరెడ్డి మండల కురుమ సంఘం అధ్యక్షులు పాల మల్లేశ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తిని భావి తరాలకు అందించేలా మనమందరం పాటుపడాలని మన కురుమలు ఇదే స్ఫూర్తితో రాజకీయంగా ఎదగాలని రాబోయే రోజుల్లో దొడ్డి కొమురయ్యలా మనము కూడా ఐక్యంగా ఉండి రాజకీయకంగా ఎదగాలని సర్పంచులు గా ఎంపీటీసీ లుగా జడ్పీటిసి లుగా ఎవ్వరికీ ఏవిధంగా అనుకూలతలు ఉన్న వదలకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు, ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు మార్కంటి భూమన్న, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్కంటి బుచ్చన్న, రామరెడ్డి కురుమ సంఘం అధ్యక్షులు పాల మల్లేశ్, పెద్దలు జై భీమ్ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న, తాడ్వాయి మండల అధ్యక్షుడు గంగారాం, ఎల్లారెడ్డి కురుమ సీనియర్ నాయకులు భీరన్న, వివిధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అంటే ఏమిటి?

**ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో కీలక ప్రక్రియ – ప్రతి ఓటరు తప్పనిసరిగా తన వివరాలను ధృవీకరించుకోవాలి**

**ప్రత్యేక ప్రతినిధి:** ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అత్యంత కీలకమైన హక్కు ఓటు హక్కు. అయితే ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదు కావడం, చిరునామా మార్పులు నమోదు కాకపోవడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ అనే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్వహిస్తుంది. ఎస్ఐఆర్ సాధారణ ఓటరు సవరణ ప్రక్రియ కాదు. ఇది ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, ప్రతి నమోదును క్షుణ్ణంగా ధృవీకరించే ప్రత్యేక కార్యక్రమం. ఈ ప్రక్రియలో మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓట్లను గుర్తించి తొలగించడం, చిరునామా మార్పులను నమోదు చేయడం, కొత్తగా అర్హత పొందిన ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి చర్యలు చేపడతారు. ఎస్ఐఆర్ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారు. ఈ సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా రుజువు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ వంటి పత్రాలను పరిశీలించవచ్చు. అవసరమైతే సంబంధిత దరఖాస్తు ఫారాలను కూడా పూరించాల్సి ఉంటుంది.

**ఉపయోగించే ఫారాలు**

- ఫారం–6: కొత్త ఓటరు నమోదు కోసం.
- ఫారం–7: అర్హత లేని లేదా మరణించిన ఓటర్ల పేర్లు తొలగించేందుకు.
- ఫారం–8: ఓటరు వివరాల్లో పేరు, చిరునామా లేదా ఇతర సమాచారం సవరణ/నవీకరణ కోసం.

చాలామంది తమ వద్ద ఓటర్ ఐడీ కార్డు ఉన్నందున ఓటు హక్కు సురక్షితంగా ఉందని భావిస్తుంటారు. అయితే ఎస్ఐఆర్ సమయంలో వివరాలను ధృవీకరించకపోతే లేదా అవసరమైన సవరణలు చేయించుకోకపోతే ఓటర్ల జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైతే వెంటనే నవీకరించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటర్ల జాబితా అవసరం. అందుకే ప్రతి పౌరుడు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామిగా మారి తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– సన్ రిపోర్టర్, రాజముద్ర

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలో రైతు వేదికలో శనివారం రోజున కళ్యాణ లక్ష్మి చెక్కులను కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు, మండలానికి సంబంధించిన 12 కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉమలత, మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తీవరి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి మాధవ రెడ్డి, అడిషనల్ డిఆర్డిఏ సత్తయ్య, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, వ్యవసాయ అధికారి కవిత, డి.ఎస్. ఓ సుదర్శన్ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# నృత్య దేవ అర్చన'తో అలరించిన భారతీయ శాస్త్రీయ నృత్యాలు

**యువ కళాకారులను ప్రోత్సహించే వేదిక: గురువు సంతోష్ కుమార్**



**శేరిలింగంపల్లి,రాజముద్ర న్యూస్:** భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను పరిరక్షించి యువ కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో డొయన్స్ కాలనీలోని శ్రీ నారాయణి నాట్యాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నృత్య దేవ అర్చన' రెండవ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా కళాకారిణి మహతి భిక్షూ కూచిపూడి నృత్యం, సబర్నిక్ డీ ఒడిస్సీ నృత్య ప్రదర్శనలతో సభికులను అలరించారు. ఈ సందర్భంగా నారాయణి నాట్యాలయ వ్యవస్థాపకుడు, ప్రముఖ భరతనాట్య గురువు సంతోష్ కుమార్ తమాంగ్ మాట్లాడుతూ, భారతీయ శాస్త్రీయ నృత్యాల అసలైన సంప్రదాయాన్ని భావితరాలకు అందించడమే లక్ష్యమన్నారు. యువ కళాకారులు తమ ప్రతిభను చూపించేందుకు 'నృత్య దేవ అర్చన' వేదికగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల ప్రతిభావంతులైన కళాకారులకు మరిన్ని ప్రదర్శన అవకాశాలు కల్పించేందుకు ట్రస్ట్ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాల

**జడ్పీహెచ్ఎస్ రామంతపూర్ ఉన్నత పాఠశాల – విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న మౌలిక వసతుల కొరత**



**రామంతపూర్:** ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్యను అందించే ప్రధాన కేంద్రాలు. అయితే రామంతపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ రామంతపూర్ ఉన్నత పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల లేమి, పారిశుద్ధ్య సమస్యలు, సిబ్బంది కొరత వంటి అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఈ పరిస్థితులు విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు చదరపు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక ప్రభుత్వ పాఠశాల ఇదే. రామంతపూర్‌లోని పలు కాలనీలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల,ఉన్నత పాఠశాల కలిపి సుమారు 950 మంది విద్యార్థులు చదువుతున్నారు.

**ఉపాధ్యాయుల కొరత**

ప్రాథమిక విభాగంలో కనీసం 8 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ప్రస్తుతం 4 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఉన్నత పాఠశాలలో 23 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ప్రస్తుతం 19 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. మొత్తంగా దాదాపు 7 మంది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

**వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది లేమి**

పాఠశాలకు ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు అవసరం ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. అంతేకాకుండా పాఠశాలలో స్వీపర్, అటెండర్ వంటి అత్యవసర సిబ్బంది ఒక్కరు కూడా లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు రోజువారీ పరిపాలనా పనులు కూడా ఇబ్బందిగా మారాయి.

# పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల చొరవ అవసరం

**పాత భవనాల స్థానంలో ఆధునిక నిర్మాణాలు చేపడితే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు**

**హైదరాబాద్:** పాఠశాలలో ఉన్న పాత భవనాల స్థానంలో ఆధునిక రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తే అదనంగా ఆరు విశాలమైన తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అదే భవనంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన మూత్రశాలలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని వారు సూచిస్తున్నారు. పాఠశాల పక్కనే ఉన్న తెలంగాణ మహిళా మండలి భవనాన్ని కూడా పాఠశాల ప్రాంగణంలో విలీనం చేసే అవకాశం కల్పిస్తే విద్యార్థులకు విశాలమైన ఆటస్థలం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పాఠశాల గ్రౌండ్ మధ్యలో ఉన్న మూత్రశాలలను తొలగించి, అనువైన ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తే



ఆటలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించడానికి మరింత విశాలమైన స్థలం లభిస్తుందని చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులను విస్తరించడం నేటి అవసరమని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. విశాలమైన తరగతి గదులు, పరిశుభ్రమైన మూత్రశాలలు, మెరుగైన ఆటస్థలం, సురక్షితమైన పాఠశాల వాతావరణం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వారు పేర్కొంటున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకుని అవసరమైన నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ఈ పాఠశాల మరింత అభివృద్ధి చెంది, నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు రాణించే అవకాశాలు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించేలా పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు ఉద్యమించాలి

**సిపిఐఎం మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి పిలుపు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవిరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నైజాం నిరంకుశ పాలనకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దున్నేవానికి భూమి కావాలని సాగించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన తొలి వీరుడు దొడ్డి కొమరయ్య అన్నారు. ఆయన ప్రాణ త్యాగం, ఉద్యమ స్ఫూర్తితో ఉవ్వెత్తున ఎగసిపడిన కెరటంలా ప్రజలు నాటి భూస్వామ్య, రజాకార్లు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ పోరును సాగించారన్నారు. సాయుధ పోరులో 4 వేల మంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించగా పదివేల ఎకరాల భూములను పంపిణీ చేశారన్నారు. భూస్వామ్య, పెత్తందారుల దోపిడీకి, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయిధ పోరు నేటి యువత, ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే దొడ్డి కొమరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఏటుకూరి



రామారావు, రావెళ్ల సుదర్శన్ రావు, వల్లంచెట్ల భాస్కరరావు, మాటూరి శేషగిరిరావు, మందడపు మురళీకృష్ణ, బొడ్డు మధు, నాగేశ్వరరావు, సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాలి ఆటో చోరీ నిందితుడు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాలీ ఆటో చోరీ కేసును రామారెడ్డి పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించి, అంతర్‌జిల్లా అలవాటు నేరస్థుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు దొంగిలించబడిన ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు కామారెడ్డి డీఎస్పీ శ్రీ మధు సూదన్ తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే, తేదీ 24.06.2026 సాయంత్రం సుమారు 17:00 గంటలకు నిజామాబాద్ నివాసి తోట నారాయణ (67) రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు, ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన భూమ్పల్లి నరేష్‌కు చెందిన బజాజ్ ట్రాలీ ఆటో (నెం. AP25X7950)ను తేదీ 23.06.2026 రాత్రి సుమారు 8:30 గంటలకు రామారెడ్డి మండలం పోసాని పేట గ్రామంలోని శ్రీనివాస బిన్నీ రైస్ మిల్ షెడ్డు వద్ద పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం రైస్ మిల్లుకు వచ్చిన సిబ్బంది షెడ్డు వద్ద పార్క్ చేసిన ట్రాలీ ఆటో కనిపించకపోవడంతో ఫిర్యాదు దారునికి సమాచారం అందించారు. దీంతో




ఫిర్యాదుదారుడు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ మధు సూదన్ పర్యవేక్షణలో కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, రామారెడ్డి ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడైన కానుగుల @ కుమ్మరి రాజు (42), మంచిప్ప గ్రామం, మోపాల్ మండలం, నిజామాబాద్ జిల్లా వాసిని తేదీ 04.07.2026న వాహన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు నిజామాబాద్‌లో దొంగిలించిన మోటార్ సైకిల్‌పై రామారెడ్డికి వచ్చి ట్రాలీ ఆటోను అపహరించిన అనంతరం, ఆ మోటార్ సైకిల్‌ను సమీపంలోని పొలాల్లో దాచిపెట్టినట్లు వెల్లడైంది. అనంతరం దాచిపెట్టిన బైక్‌ను విక్రయించేందుకు వచ్చిన సమయంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన సహచరుడు గోత్రాల నాగరాజుతో కలిసి నిజామాబాద్‌లో ఒక మోటార్ సైకిల్‌ను, అనంతరం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మోటార్ సైకిల్‌ను దొంగిలించినట్లు, అనంతరం పోసానిపేట శివారులోని శ్రీనివాస బిన్నీ రైస్ మిల్ షెడ్డు నుంచి బజాజ్ ట్రాలీ ఆటో (నెం. AP25X7950)ను అపహరించినట్లు అంగీకరించాడు. నిందితుడి స్వాధీనం నుంచి దొంగిలించబడిన బజాజ్ ట్రాలీ ఆటో (AP25X7950)తో పాటు ఒక ఐక్యూ స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు ప్రధాన నిందితుడు కానుగుల @ కుమ్మరి రాజు గతంలో కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ తదితర జిల్లాల్లో నమోదైన పలు ఆస్తి నేరాల్లో నిందితుడిగా ఉండి, పలుమార్లు జైలు శిక్ష అనుభవించిన అలవాటు నేరస్థుడని డీఎస్పీ తెలిపారు. కాగా, ఈ కేసులో సహనిందితుడు గోత్రాల నాగరాజు ఇప్పటికే దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అరెస్టై జిల్లా జైలులో ఉన్నాడు.ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి, దొంగిలించబడిన ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన రామారెడ్డి ఎస్ఐ మురళి, కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ యం . రాజేష్ చంద్ర, అభినందించినట్లు కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ తెలిపారు.

# దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్

- **సమష్టి సహకారంతో నెల రోజుల్లో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు**
- **టీజీ రెడ్కో వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ ఐఏఎస్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్‌ను తీర్చిదిద్దే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వెండర్లు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని టీజీ రెడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్ పిలుపునిచ్చారు. కొడంగల్ కాడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సిములు, టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డిస్కం, టీజీ రెడ్కో అధికారులు, వెండర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో మోడల్ సోలార్ విలేజ్‌లు మాత్రమే అమలులో ఉన్నాయని, ఒక సంపూర్ణ మండలాన్ని సోలార్ మోడల్ మండలంగా అభివృద్ధి చేసే కార్యక్రమం దేశంలోనే తొలిసారిగా కొడంగల్‌లో అమలవుతుండటం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే కొడంగల్ దేశవ్యాప్తంగా ఆదర్శ మండలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొడంగల్ మండలంలో గృహజ్యోతి పథకం కింద ఉన్న 5,186 విద్యుత్ సర్వీసులకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 2,418 సర్వీసులు సాంకేతికంగా అనుకూలంగా గుర్తించగా, ఇప్పటికే సుమారు 2,000 సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన పనులను



కూడా రాబోయే నెల రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులను మి/స్ క్లారో ఎనర్జీ లిమిటెడ్ మి/స్ హిందుస్తాన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు చేపడుతున్నాయని తెలిపారు. సోలార్ మోడల్ మండలం లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా సాధించాలంటే సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధుల సహకారం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదారులను ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయవచ్చని అన్నారు. సమీక్ష సమావేశంలో పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో జరుగుతున్న పనుల వివరాలు, లబ్ధిదారుల జాబితా తమకు అందుబాటులో లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన టీజీ రెడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంటనే టీజీ రెడ్కో అధికారులు, సంబంధిత వెండర్లకు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాను కాడా అధికారుల ద్వారా ఆయా సర్పంచులకు అందజేయాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో పంచుకోవాలని సూచించారు. అదేవిధంగా వెండర్లు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మౌంటింగ్ స్ట్రక్చర్లకు సరైన గ్రౌటింగ్, సమర్థవంతమైన ఎర్తింగ్, లైట్నింగ్ ప్రొటెక్షన్, నీడలేని ప్రదేశాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. టీజీఎస్పీడీసీఎల్ అధికారులు నెట్ మీటర్ల ఏర్పాటు, గ్రిడ్ సింక్రొనైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరితగతిన సోలార్ విద్యుత్ ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసి, కొడంగల్‌ను దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకట రెడ్డి, మున్సిపల్ చైర్మన్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సిములు, టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్, టీజీ రెడ్కో అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డిస్కం అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వెండర్లు పాల్గొన్నారు.

# డకెట్‌కు కొత్త జోడీ!





**లండన్, జులై 4 :** వన్డే ప్రపంచకప్--2027 సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్ జట్టు ఓపెనింగ్ జోడీని ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. బెన్ డకెట్‌కు స్థిరమైన భాగస్వామి కోసం అన్వేషిస్తున్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యువ బ్యాటర్ జాకబ్ బెథెల్‌పై ఆశలు పెట్టుకుంది. మూడు ఫార్మాట్లలోనూ దూకుడైన ఆటతో ఆకట్టుకుంటున్న ఈ యువ క్రికెటర్‌ను భవిష్యత్ ఓపెనర్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న బెథెల్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌లోనే డకెట్‌కు జోడీగా పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం ఇయాన్ మోర్గాన్ నాయకత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ మరోసారి ప్రపంచకప్‌పై కన్నేసింది. మెగా టోర్నీకి మరో ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్టు కూర్పుపై బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. అయితే బెన్ డకెట్‌కు సరైన ఓపెనింగ్ భాగస్వామి ఇంకా దొరకకపోవడం ఆ జట్టుకు తలనొప్పిగా మారింది. గత కొంతకాలంగా ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలే, రెహాన్ అహ్మద్‌లకు అవకాశాలు ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో ఇప్పుడు జాకబ్ బెథెల్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటివరకు 21 వన్డేలు ఆడిన బెథెల్ 19 ఇన్నింగ్స్‌ల్లో 33.50 సగటుతో 603 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 110 పరుగులు. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం అతడిని ఓపెనర్‌గా పరిశీలించడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. వన్డేలతో పాటు టెస్టుల్లోనూ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై అతడు అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా సిడ్నీ టెస్టులో 229 బంతుల్లో 142 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ బెన్ డకెట్‌కు జోడీగా బెథెల్‌ను బరిలోకి దించే దిశగా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రజ్ఞానంద జోరు.. అగ్రస్థానంలోకి



**జాగ్రెబ్, జులై 4 :** క్రొయేషియాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ర్యాపిడ్ విభాగం చివరి రోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరౌజాతో కలిసి సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్ మాత్రం చివరి రోజు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసి ఐదో స్థానానికి పరిమితమయ్యాడు. ర్యాపిడ్ విభాగంలో చివరి రోజు ప్రజ్ఞానంద పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆతిథ్య దేశం క్రొయేషియాకు చెందిన ఇవాన్ సరిక్, రొమేనియాకు చెందిన డీక్ బొగ్డన్, నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనిశ్ గిరిలపై వరుస విజయాలు నమోదు చేశాడు. ఈ మూడు విజయాలతో మొత్తం 12 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. ప్రజ్ఞానందతో సమానంగా ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరౌజా కూడా 12 పాయింట్లతో సంయుక్త అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన డి. గుకేశ్‌కు చివరి రోజు ఏమాత్రం కలిసిరాలేదు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడంతో అతడు జర్మనీకి చెందిన విన్సెంట్ కేమెర్‌తో కలిసి 10 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు టోర్నీలోని బ్లిట్జ్ విభాగం మిగిలి ఉంది. మొత్తం 18 రౌండ్ల పాటు సాగే ఈ పోటీల్లోనే గ్రాండ్ చెస్ టూర్ విజేత ఎవరో తేలనుంది. దీంతో ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మెక్సికో మ్యాచ్‌కు ఇంగ్లండ్ ప్రత్యేక వ్యూహం




**మెక్సికో సిటీ, జులై 4 :** ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికోతో తలపడనున్న ఇంగ్లండ్ జట్టు ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. అధిక ఎత్తులో ఉన్న స్టేడియంలో ఆటగాళ్లు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు వైద్యుల పర్యవేక్షణలో వయాగ్రా మాత్రల వినియోగానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ నిర్ణయం ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్‌టెకా స్టేడియంలో ఈ నాకౌట్ మ్యాచ్ జరగనుంది. సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మైదానంలో ఆక్సిజన్ సాంద్రత తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు త్వరగా అలసిపోయే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక సన్నాహాలు చేసింది. ఇప్పటికే ఆటగాళ్లు తగినంత విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేసిన జట్టు యాజమాన్యం, మ్యాచ్ సమయంలో శారీరక సామర్థ్యాన్ని నిలబెట్టేందుకు వైద్యపరమైన సూచనల మేరకు వయాగ్రా వినియోగానికి కూడా అనుమతించినట్లు తెలుస్తోంది. అధిక ఎత్తులో రక్తనాళాలు విస్తరించి రక్తప్రసరణ మెరుగుపడేందుకు వయాగ్రా కొంతమేర ఉపయోగపడుతుందని గతంలో కొన్ని వైద్య పరిశోధనలు సూచించాయి. ఇదే కారణంతో ఇంగ్లండ్ జట్టు ఈ మార్గాన్ని పరిశీలించినట్లు సమాచారం. సాధారణంగా ఈ ఔషధాన్ని వేరే వైద్య అవసరాల కోసం వినియోగించినప్పటికీ, అధిక ఎత్తులో శారీరక సామర్థ్యాన్ని మెరుగుపర్చే అవకాశాలపై కూడా కొన్ని అధ్యయనాలు జరిగాయి. ఆతిథ్య మెక్సికో ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, ఎత్తైన మైదాన పరిస్థితులు అలవాటై ఉండటంతో వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయితే ఇంగ్లండ్ ఆటగాళ్లు అలసటకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసంగా ఉన్న మెక్సికోను నిలువరించేందుకు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగుతున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.

# కేప్ వెర్డే పోరాటం..

## అర్జెంటీనాకు చెమటలు



**మెక్సికో సిటీ, జులై 4 :** ఫిఫా ప్రపంచకప్–2026 నాకౌట్ దశలో అర్జెంటీనా, కేప్ వెర్డే మధ్య జరిగిన పోరు అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనాను చిన్న ద్వీప దేశమైన కేప్ వెర్డే చివరి వరకు గట్టిగా నిలువరించినా అదనపు సమయంలో 3--2 తేడాతో ఓటమి పాలైంది. ఓడిపోయినప్పటికీ కేప్ వెర్డే ప్రదర్శన ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. అర్జెంటీనా ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించగా, కేప్ వెర్డే కట్టుదిట్టమైన రక్షణతో పాటు వేగవంతమైన ఎదురుదాడులతో ఆకట్టుకుంది. నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసే సమయానికి ఇరు జట్లు చెరో గోల్ నమోదు చేయడంతో స్కోరు 1--1తో సమమైంది. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయం ప్రారంభంలోనే అర్జెంటీనా మరో గోల్ చేసి 2--1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ తమ చేతిలోనే ఉందని భావించిన సమయంలో కేప్ వెర్డే మిడ్‌ఫీల్డర్ సిడ్నీ లోప్స్ కాబ్రల్ అద్భుత గోల్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. పెనాల్టీ ప్రాంతం అంచు నుంచి అతడు కొట్టిన శక్తివంతమైన షాట్ నేరుగా గోల్‌పోస్ట్ పై మూలలోకి దూసుకెళ్లడంతో స్కోరు 2--2తో సమమైంది. ఈ గోల్ టోర్నీలోనే అత్యుత్తమ గోల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మ్యాచ్ ముగియడానికి కొద్దిసేపటి ముందు అర్జెంటీనా మరోసారి తన అనుభవాన్ని చాటుకుంది. కేప్ వెర్డే రక్షణను ఛేదించి మూడో గోల్ నమోదు చేయడంతో 3--2తో ఆధిక్యం సాధించింది. మిగిలిన సమయంలో కేప్ వెర్డే సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అర్జెంటీనా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించగా, ఓటమిపాలైన కేప్ వెర్డే తన అసాధారణ పోరాట పటిమతో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల ప్రశంసలు అందుకుంది.



# నేడు భారత్-ఇంగ్లండ్ రెండో టీ20

**మాంచెస్టర్, జులై 4:** భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ శనివారం మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఐర్లాండ్ పర్యటనలో సిరీస్‌ను కోల్పోయిన భారత్, ఇంగ్లండ్‌తో తొలి టీ20 వర్షం కారణంగా రద్దు కావడంతో ఈ మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే లక్ష్యంతో ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో సంచలన ప్రదర్శనలతో గుర్తింపు తెచ్చుకున్న యువ ఆల్‌రౌండర్ వైభవ్ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానం సాధారణంగా బ్యాటర్లు, బౌలర్లకు సమానంగా సహకరించే పిచ్‌గా గుర్తింపు పొందింది. అయితే పరిస్థితులు అనుకూలిస్తే భారీ స్కోర్లు నమోదవుతుంటాయి. గతేడాది ఇదే వేదికపై దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో ఇంగ్లండ్ 304 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ భారీ స్కోరు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. టాస్ గెలిచే జట్టు పిచ్ పరిస్థితులను బట్టి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు వెంటాడుతోంది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండా రద్దయిన నేపథ్యంలో రెండో మ్యాచ్‌కు కూడా వర్షం ఆటంకం కలిగించే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో అభిమానుల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. వర్షం దూరంగా ఉండి మ్యాచ్ పూర్తిస్థాయిలో సాగితే ఆసక్తికర పోరు ఖాయమని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# అబ్రార్‌కు దేశమా.. లీగ్‌నా?



**లాహోర్, జులై 4 :** పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత కీలకమైన సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఒకవైపు దేశం తరఫున వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో ఆడే అవకాశం ఉండగా, మరోవైపు భారీ పారితోషికంతో ఒప్పందం కుదుర్చుకున్న ఇంగ్లండ్‌లోని ప్రముఖ ఫ్రాంచైజీ లీగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. రెండు టోర్నీల షెడ్యూళ్లు ఒకేసారి రావడంతో అబ్రార్ ఏ నిర్ణయం తీసుకుంటాడనే అంశం ఆసక్తికరంగా మారింది. పాకిస్థాన్ జట్టు ఈ నెలలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు అబ్రార్ అహ్మద్‌ను ఎంపిక చేయాలని సెలక్షన్ కమిటీ యోచిస్తోంది. అదే సమయంలో ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌కు కూడా అతడు ఎంపికయ్యాడు. ఈ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్‌ను సుమారు రూ.2.3 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ జట్టుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ యాజమాన్యం వహిస్తున్నారు. 'ది హండ్రెడ్' టోర్నీ జులై 21న ప్రారంభం కానుండగా, వెస్టిండీస్‌తో పాకిస్థాన్ తొలి టెస్టు జులై 25 నుంచి ప్రారంభమవుతుంది. దీంతో రెండు టోర్నీల్లో ఒకేసారి పాల్గొనడం సాధ్యం కాకపోవడంతో అబ్రార్ ఏదో ఒకదానిని మాత్రమే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టు జట్టులో చోటు దక్కితే లీగ్‌కు దూరం కావాల్సి ఉంటుంది. అబ్రార్‌ను 'ది హండ్రెడ్' వేలంలో కొనుగోలు చేయడం గతంలోనే పెద్ద చర్చకు దారితీసింది. భారత్–పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలు నిలిచిపోయిన నేపథ్యంలో భారత యాజమాన్యంలోని ఫ్రాంచైజీ పాకిస్థాన్ ఆటగాడిని భారీ మొత్తానికి తీసుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే అన్ని దేశాల ఆటగాళ్లకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబంధనల ప్రకారం ఎంపిక జరిగినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇక పాకిస్థాన్ జట్టు దృష్టిలో వెస్టిండీస్ పిచ్‌లపై అబ్రార్ లాంటి లెగ్ స్పిన్నర్ కీలక పాత్ర పోషిస్తాడనే అభిప్రాయం ఉంది. అందుకే అతడిని టెస్టు జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సోమవారం టెస్టు జట్టును ప్రకటించనున్న నేపథ్యంలో అబ్రార్‌కు స్థానం దక్కుతుందా లేదా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ టెస్టు జట్టులో ఎంపికైతే 'ది హండ్రెడ్' లీగ్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిరభ్యంతర పత్రం జారీ చేస్తుందా లేదా అనేది కూడా కీలకంగా మారింది. దీంతో అబ్రార్ భవిష్యత్తు ఇప్పుడు సెలక్టర్లు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

# విజయం వచ్చినా మెస్సీ అసంతృప్తి



**మయామి, జులై 4 :** ఫిఫా ప్రపంచకప్–2026 రౌండ్ ఆఫ్–32లో కేప్ వెర్డేపై 3–2 తేడాతో కష్టపడి విజయం సాధించి ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న అర్జెంటీనా జట్టు ఆటతీరుపై కెప్టెన్ లియోనెల్ మెస్సీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గెలుపు దక్కినప్పటికీ జట్టులోని లోపాలు స్పష్టంగా కనిపించాయని, నాకౌట్ దశలో ఇలాంటి తప్పులు పునరావృతమైతే తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుందని సహచర ఆటగాళ్లను హెచ్చరించాడు. మయామిలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2--2తో సమంగా నిలిచాయి. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయంలో మెస్సీ కొట్టిన కార్నర్‌ను అర్జెంటీనా ఆటగాడు రొమెరో హెడర్‌తో గోల్‌గా మలిచే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బంతి కేప్ వెర్డే ఆటగాడి చేతికి తగిలి వారి సొంత గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో అర్జెంటీనాకు అదృష్టం కలిసి వచ్చింది. అదే నిర్ణయాత్మక గోల్‌గా మారడంతో 3–2తో విజయం సాధించిన అర్జెంటీనా ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. తదుపరి మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో తలపడనుంది. మ్యాచ్ అనంతరం మెస్సీ మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేశాడు. ప్రారంభంలో ఆధిక్యం సాధించిన తర్వాత ఆటను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకోవాల్సి ఉండగా అలా చేయలేకపోయామని చెప్పాడు. బంతిపై ఆధిపత్యాన్ని కోల్పోవడంతో పాటు ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యామని పేర్కొన్నాడు. కేప్ వెర్డే ఆటగాళ్లు శారీరక బలంతో తమపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని, అలాంటి పరిస్థితుల్లో జట్టు మరింత మెరుగ్గా ఆడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. కేప్ వెర్డేను తాము ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేదని మెస్సీ స్పష్టం చేశాడు. గతంలో బలమైన జట్లను కూడా ఇబ్బంది పెట్టిన ఆ జట్టు నాకౌట్ దశకు చేరుకోవడం యాదృచ్ఛికం కాదని చెప్పాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఏ ప్రత్యర్థినైనా తేలికగా తీసుకుంటే ప్రమాదమేనని, ఇప్పుడు పూర్తిగా ఈజిప్ట్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌పైనే దృష్టి సారిస్తామని వెల్లడించాడు. జట్టు ఆటపై అసంతృప్తి వ్యక్తం చేసిన మెస్సీ వ్యక్తిగతంగా మాత్రం అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 29వ నిమిషంలో గోల్ నమోదు చేసిన అతడు ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో వం-సగా ఎనిమిది మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ విజయంతో అర్జెంటీనా టోర్నీలో తన అజేయ ప్రస్థానాన్ని కొనసాగించింది..

# 10న విడుదలవుతున్న లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.






# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.

# రాజమౌళికి అరుదైన గౌరవం

## వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు




తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినీమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.

# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

## కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో




నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్-ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.



# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టగ్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com